

**నగరంలోని** ఖిల్లా రోడ్‌లో ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ శనివారం రోడ్ షో నిర్వహించారు. నగరానికి చేరుకున్న కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు.

– ఖలీల్‌వాడి, నవంబర్ 25

## తెలంగాణను దోచుకోవడానికే కాంగ్రెస్, బీజేపీల కుట్ర

- రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశాం..
- అప్పుడెట్లుండె తెలంగాణ.. ఇప్పుడెట్ల ఉన్నది..
- పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెడితే చూస్తూ ఊరుకోం..
- 'నమస్తే తెలంగాణ'తో ఉద్యమకారుడు డాక్టర్ తెలంగాణ శంకర్



నమస్తే ఇంటర్వ్యూ
INTERVIEW

ఖలీల్‌వాడి నవంబర్ 25 : తెలంగాణ కోసం ఎన్నో రోజులు బయట తిరిగానని.. ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు చేశానని... లాఠీ దెబ్బలు తిన్నానని తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ తెలంగాణ శంకర్ తెలిపారు. 'నమస్తే తెలంగాణ'తో ఆయన పలు విషయాలను పంచుకున్నారు.

పోరాడి సాధించుకున్న తెలంగాణ అప్పుడు ఎట్లా ఉంది.. ఇప్పుడెట్లా మారిందో ప్రజలు గమనించాలి. ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతో బీజేపీ, కాంగ్రెసోళ్లకు నిద్రపట్టడం లేదు. దోచుకోవడానికి దొంగ ఒకడు ఆంధ్ర నుంచి వచ్చాడు. మరొకడు గుజరాత్ నుంచి వచ్చాడు.. ఇలా ఎవడుపడితే వాళ్లు వచ్చి తెలంగాణను తీసుకుపోతామంటే ప్రజలు ఊరుకోరు. ఆనాడు దాశరథి 'నా తెలంగాణ...కోటి రతనాల వీణ' అని ఊరికే అనలేదు. ఆకలి బతుకులు పోయాయి. పంటలు పండి సుఖశాంతులతో ఉండే తెలంగాణని మళ్లీ నాశనం చేయడానికి వస్తున్నారు. తెలంగాణ సంక్షేమం ముందు అన్ని పార్టీలు దిగదుడుపే.

**ఐదు సార్లు జైలుకు వెళ్లా.. 60 కేసులు పెట్టారు..**

ఉద్యమం సమయంలో ఉస్మానియా యూనివర్సిటీలో ధర్నాలు చేశాను. ఆ సమయంలో పోలీసోళ్లు కొడితే విపరీతంగా ఏడ్చాను. తిండి తిప్పలు లేక నరకం అనుభవించా.. 5 సార్లు జైలుకు తీసుకెళ్లారు. 60 కేసులు పెట్టారు. అయినా వెనకడుగు వేయలేదు. కవితక్క చాలా సపోర్ట్ చేసింది. మాతో పాటు ఉద్యమంలో పాల్గొన్నది.

**తెలంగాణలో ఎంత మార్పు..**

తెలంగాణలో అప్పుడెట్లుంది.. ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నది. ఆ విషయం బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు కూడా తెలుసు. నిజామాబాద్ నగరం చాలా సుందరంగా తయారైంది. అభివృద్ధికి మారుపేరుగా నిజామాబాద్ నిలుస్తున్నది. అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా ఎన్‌ఆర్‌ఐ ఆయనకు పైసలతో పని లేదు. నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రజల కోసమే పని చేస్తారు.

**రాష్ట్రాన్ని దోచుకోవడానికి వస్తున్న గజదొంగలు బీజేపీ, కాంగ్రెస్**

50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏనాడూ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు. అధికారంలో ఉన్న నాడు చేయని అభివృద్ధి ఇప్పుడు చేస్తారా. సస్యశ్యామలంగా మారిన తెలంగాణను మళ్లీ నాశనం చేసేందుకే వస్తున్నారు. మన దగ్గర అమలవుతున్న బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు కావడం లేదు. 24 గంటల కరెంట్ ఇచ్చే దమ్ములేదు. కర్ణాటకలో అమలు సాధ్యం హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ చేతులు ఎత్తేసింది. రైతుల గురించి ఆలోచన చేయనోళ్లు ఏం అభివృద్ధి చేస్తారు..

**బీఆర్‌ఎస్‌తోనే అనేక సంక్షేమ పథకాలు**

ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు, 24 గంటల విద్యుత్ అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేదవారిపై భారాన్ని తగ్గించేందుకు గ్యాస్ ధరను తగ్గించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోలో చేర్చింది. మానవీయ కోణంలో సీఎం కేసీఆర్ పథకాలను ప్రవేశపెడుతూ పకడ్బందీగా అమలు చేస్తున్నారు. పచ్చగా ఉన్న తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు వస్తున్న పార్టీలను తగిన బుద్ధి చెబుతాం.

## మిషన్ భగీరథ పంపుహౌస్‌ల తనిఖీ

సిరికొండ, నవంబర్ 25 : మిషన్ భగీరథ పంపుహౌస్‌లను సీఈ రాంచందర్‌నాయక్ శనివారం తనిఖీ చేశారు. మండలంలోని లొంక, మైలారం గ్రామాల్లోని మిషన్ భగీరథ పంపుహౌస్‌లను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పూలమొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు. మోటర్లను ఎక్కువగా రన్ చేయవద్దని, 8 గంటలకు ఒకసారి మారుస్తూ ఉండాలని ఆపరేటర్లకు సూచించారు. ఆయన వెంట ఈఈ నరేశ్, డీఈ అరుణ్, ఏఈ శివ, మండల ఇన్‌చార్జి చారి, ఆపరేటర్ సూపర్‌వైజర్ రాజేశ్వర్, లైన్‌మెన్ సూపర్‌వైజర్ హేమంత్, అరవింద్, ఆపరేటర్లు శంకర్, నర్సింగ్, విద్యాసాగర్, రవీందర్, హౌస్ కీపింగ్ సుమన్, మహిపాల్, నైట్ వాచ్‌మెన్ నరహరి ఉన్నారు.

## ఘనంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డే




ఫౌండేషన్ డేలో పాల్గొన్న బ్యాంకు అధికారులు

ఖలీల్‌వాడి, నవంబర్ 25 : నగర శివారులోని కృష్ణ హోటల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి రీజినల్ హెడ్ శంకర్ హెంబ్రామ్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్టమర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ లావాదేవీలను పెంచాలని అన్నారు. అతి తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తున్నామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ రాంప్రసాద్, శివకోటయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రాజ్‌కుమార్ సుబేదార్

## ఖైదీల్లో సత్ప్రవర్తన రావాలి

నిజామాబాద్ లీగల్, నవంబర్ 25 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు క్రిమినల్ నేరాల్లో ముద్దాయిలుగా ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ చీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్ తెలిపారు. జిల్లా కేంద్ర కారాగారంలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ఖైదీలను ఉద్దేశించి ప్రసంగించారు. నేరమయ విష సంస్కృతిని విడనాడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నేరాలకు పాల్పడిన వారు ఆత్మావలోకనం చేసుకొని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. జైలును పవిత్ర స్థలంగా మార్చుకొని మార్పు చెందాలని, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. సదస్సులో లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ ఉదయ కృష్ణ, శుభం, ప్రమోద్, జైలు అధికారులు పాల్గొన్నారు.

## స్త్రీలపై హింసను వ్యతిరేకిద్దాం




సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పిలుపు

నిజామాబాద్ లీగల్, నవంబర్ 25 : మహిళలపై అన్ని రకాల హింసను అరికట్టాలని, ఇందుకు అందరూ కలిసికట్టుగా కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల పిలుపునిచ్చారు. స్త్రీల పై హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టు ప్రాంగణంలోని గంగారెడ్డి మెమోరియల్ హాలులో స్నేహ సొసైటీ సహకారంతో న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కళాశాలల విద్యార్థినులు చాలా జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే పోలీసు సహకారం తీసుకోవాలని సూచించారు. హింస నిరోధానికి ఉన్న చట్టపరమైన అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, సీనియర్‌సివిల్ జడ్జి పద్మావతి, స్నేహ సొసైటీ ప్రతినిధులు జ్యోతి, డాక్టర్ అపర్ణ పాల్గొన్నారు.

**ఘనంగా రాజ్యాంగ దినోత్సవం**

ఖలీల్‌వాడి, నవంబర్ 25 : నగరంలోని ఎస్సెస్సార్ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దేశ రాజ్యాంగ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి సునీత కుంచాల హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను వినియోగించుకోవడంతోపాటు పౌరులుగా తమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఏర్పర్చుకున్న లక్ష్యాలను సాధించడానికి కృషి చేయాలని, అపజయాలను విజయాలుగా మార్చుకొని ఉన్నత స్థానాన్ని పొందాలన్నారు. ప్రజలకు అవసరమైన న్యాయసేవలను ఉచితంగా అందిస్తున్నామని, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎస్సెస్సార్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం. మారయ్యగౌడ్, పురుషోత్తం గౌడ్, ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్, బి.స్వప్న, జి.ఆనంద్‌కుమార్ వెంకటమల్లయ్య, చెరుకుల లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు శక్తి

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 25 : ఆర్మూర్ శాసనసభ నియోజకవర్గ పరిధిలోని ఆర్మూర్, పిప్రి తదితర ప్రాంతాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు శక్తి శనివారం పరిశీలించారు. ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి.. స్థానికులు, అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య తదితరులు ఉన్నారు.